**ఈ వా రం క థ ▶**

# పాపభోక్తలు

**—బలివాడ కాంతారావు**

వేసవి చివరి రోజుల్లో ఒక మిట్ట మధ్యాన్నం ఒక బస్సు ఒక చిన్న పట్టణం నించి బయలుదేరింది. ప్రైవేటు బస్సు పాత బస్సు పూత బూసి పైకి చక్కదనంగా కనిపిస్తున్నా, లోన లొటలొటలాడిపోతోంది. ఏ సీటూ సరిగ్గా లేదు. రెండు ప్రక్కల నున్న పరదాలూ చిరిగే వున్నాయి. ఆ వూర్లో ఒక నాయకుని చావుకు సంతాపం తెలియజెయ్యడానికి పై వూర్ల నించి వచ్చిన వాళ్లు కూడా కొందరీ బస్సునే పట్టుకున్నారు. అందుకే బయలుదేరిన చోటే బస్సు నిండిపోయి, మనుషులు లోన నిల్చునే వున్నారు.

సానుభూతి అనేది అన్ని సందర్భాలలోనూ మానవుడిలోని మంచి గుణమనలేము. ఒక్కో సందర్భంలో అది మనిషి లోపలి వికృతిని బయట పెట్టేదిగా కూడా వుంటుంది. అత్యాచారం జరిగిన వారిపై 'సానుభూతి' చూపడం అటువంటిదే. ఆ 'సానుభూతి'లో అసహ్యకరమైన 'ఆసక్తి' దాగి వుండి బయటికి సానుభూతిగా కనిపిస్తుంది.

ఇటువంటి 'ఆసక్తి' మన చట్టాలలో, చట్టాలను పరిరక్షించే న్యాయస్థానాలలో, కళల్లో...ఆ మాటకొస్తే సమాజానికే వుంది. 'అత్యాచారం' జరపడం దుర్మార్గమైతే, అందునుంచి లోలోపల ఆనందం అనుభవించడం ఇంకెంత దుర్మార్గం?

పట్నం దాటేలోగా ఎక్కడ మనిషి నిల్చొని చెయ్యి వూపితే డ్రయివరు అక్కడ బస్సు నిల్చోబెట్టేస్తున్నాడు. కండక్టరు మనుషులను మేకలను కుని లోపలికి కుక్కుతున్నాడు. ఎవరో లోపలి నించే అప్పుడే అరుస్తున్నాడు. "ఇంకా యెక్కిస్తున్నావా బాబూ? దేముడా, పైసాలిచ్చి పాపం కొనుక్కుంటువ్నాంరా! మా మొర ఆలకించు."

"అసలు పాపం ఆలోచించినావా" అన్నాడొకడు.

"అదేంటది?"

"కొబ్బరిసెగ తగిలినట్లు నీకు యెండ తగల్లేదా? ఈ ఏడాది యింకా వానజల్లు కురిసిందా? వానలు కురిస్తేనే వసుంధర అంటారు పెద్దలు."

"వానలెలాగొస్తాయ్? దానధర్మాలు ధరణి నించి పోతంటే!"

"వానలు యెగ్గొట్టే మంటలు, ఎక్కువైతే వరదలు" ఇంకో గొంతుక అరచింది.

"వాన రాకడా, ప్రాణం పోకడ యెవరెరుగుదురులే" మరో గొంతుక.

బస్సు పట్నం దాటింది. త్రోవలో అక్కడక్కడా ఆగుతూనే వుంది. మనుషులు యెక్కుతున్నారు గానీ దిగలేదు. కొంతదూరం బస్సు నడిచాక, కొండల చాటున దాగున్న కారుమబ్బులు గడగడా వచ్చి మీద పడ్డాయ్. ఎడతెరిపిలేని వర్షమైనా మధ్యలో బస్సు ఆగుతూనే వుంది. మనుషులు యెక్కుతునే వున్నారు.

"పాపం కొనుక్కున్న యీ పేసింజిర్లో యెవరో ఒక పుణ్యాత్ముడున్నాడు. మనిషి ముకం చూసి మొదలు తుది సెప్తావంటావు కదా, ఆ పుణ్యాత్ముడ్ని సూపించగలవా" అన్నాడొకడు పక్కవానితో.

అంతవరకూ నిల్చున్న ఒక పదేళ్ల అమ్మాయి ముఖంలో సుఖం లేదు. మోకాళ్లలో బిగువు లేనట్లు యేడుస్తూ కూర్చుండిపోయింది. వర్షం కుండపోతగా కురుస్తూనే వుంది. బస్సు నడుస్తునే వుంది. మధ్యలో ఆగుతూ పాసంజిర్లను యెక్కిస్తూనే వుంది. బయట తడచిన వాళ్లు లోనా తడుస్తున్నారు. పరదాలు లాగినా వెలిపిరి లోనికి కొన్ని చోట్ల కొట్టున్నది. బస్సు టాపు నించి అక్కడక్కడా చిమ్ముతున్న నీటి ముక్కలు రాలుతున్నాయ్. ఒక చోట వెనుక సీటుపై ఆకాశ ధారలా నీరు పడ్తోంది. అయినా, బస్సు ఆగిపోలేదు. పందు మీసాల డ్రైయివరు, నోటిలో జానెడు చుట్టపెట్టి వుషారుగా నడుపుతూ ప్రక్కనే ఒకవిని కూర్చోబెట్టుకున్నాడు.

త్రోవలో వర్షంలో యెక్కినా, ముందుకు డ్రయివరు దగ్గిర కూర్చున్న పోలీసువాడ్ని చూసి "పైసాలిచ్చి మనం పాపం కొనుక్కున్నామా? ఒక్క పైసా యివ్వకుండానే అతగాడు పుణ్యం సంపాదించుకున్నాడు. అతగాడేనయ్యా పుణ్యాత్ముడు" అని సీటు మీద కూర్చున్న ఒక ఆయన యిదివరకు పాప పుణ్యాల గురించి మాటాడిన వాడితో అన్నాడు.

"పోలీసోడు ఆలకి అయినోడు. అయినోలకి ఆకులో వడ్డించక, నేల కుక్కకి పెట్టినట్లు కుంభం పోస్తాడా?"

"అదేటిరా అసలు బస్సంటే యేటి? గేదనుకో.

గేదెను కొనడంతో సరా. దానిని తోలడం అంత సులువు కాదు.''

''ఏటయ్యా అలా మీద పడిపోతున్నావు? సరిగ్గా కూర్చో'' పక్కవాడ్ని తోస్తూ కసిరాడాకాయన.

అతగాడు మేల్కొని, ఆవలింతలు తీస్తూ - ''రెండు రాత్రులు నిద్దర్లేదు. కంటి రెప్పలు సచ్చిపోనాయి'' అన్నాడు.

''ఏల నిద్దర్లేదు?''

''నీవు లీడరునాగున్నావు. అందుకే అలాటి ప్రశ్న యేస్తన్నావు.''

''నివ్వు నా మీద పడితే తప్పనేదు, నేను ప్రశ్న వేస్తే తప్పొచ్చిందా?''

అవతలవాడికి బాగా తెలివి వొచ్చినట్లుంది. గట్టిగా అన్నాడు ''వాగి వర్షం తెచ్చిన పుణ్యాత్ముడితగాడే''

''ఏటి! మర్యాదా మంచీ లేకండ అలా వాగుతున్నావు?'' కళ్లెర్రజేశాడు లీడరు.

''లీడరంటే తప్పేటయ్యా. బస్సులో వున్న యావన్మందిని అడుగు. లీడరు తంతేమిటి? ప్రశ్న లేస్తాడు, సమాధానాలు సెప్తడు. నివ్వు బస్సెక్కిన దగ్గిరనించి అదే సేస్తన్నావు కదా.''

''నివ్వే మాటకారివి, నివ్వే లీడరివి.''

వెనుక నించి ఒకడు ''బాబూ, మీరిద్దరూ లీడర్లులాగే వున్నారు. రెండు వేరు పార్టీల లీడర్లు ఒక సీట్లో కూర్చున్నారు కానీ యిద్దరూ ఒకటే'' అని అరిచాడు.

''ఏటయ్యా ఒకటి. నా అంతస్థు యెక్కడ, వాడి అంతస్థెక్కడ'' అని పెద్ద లీడరు వురిమాడు.

''ఇద్దరూ మాంసం ముక్క మా మధ్యకి విసిరి, మాలో మాం కొట్టుకున్నట్లు సేస్తున్నారు. మరి తమరిద్దరూ లీడర్లు కాకపోతేయింకెవరు?'' వెనుక నించి అరుపు.

ఇంతలో ఆ పదేళ్ల అమ్మాయి గోల. పక్కనే నిల్చున్నవాడు చప్పున ఆతృతతో కూర్చుండి పోతే ''నీకేం మతిపోయిందా? నా కాళ్లు తొక్కేసావు'' పెద్ద లీడరు కేక.

''ఏమైందిరా'' అని రెండో లీడరు అడిగాడు.

వాడు యెవరికీ సమాధానం చెప్పకుండా ఆ అమ్మాయి కడుపు నిమురుతూ ''వూరుకో తల్లీ, వూరుకో అమ్మా'' అని ఓదారుస్తున్నారు.

''బుద్ధి లేదురా. వంట నిమ్మళం లేని పిల్లని, కిక్కిరిసిన బస్సెక్కిస్తావా?''

తల మీద చిన్న పాగా, మాసిన పంచ యెత్తి కట్టాడు. ఖద్దరు బనియాను. వాడిని చూసి పెద్ద లీడరు ''కడుపులో నొప్పా'' అని ప్రశ్నిం చాడు. వాడు జవాబు చెప్పడు. కోపంగా ''చెవుడా! బుద్ధీ



బుర్ర వుండక్కర్లేదా? జబ్బు మనిషిని యీ రద్దీలో యిరికిస్తావురా. ఈ ఎక్స్ప్రెస్‌లో యెందుకెక్కావు? ఎక్కడికి వెళ్తా వురా?'' ప్రశ్నల వర్షం కురిపించాడు.

''సికాకుళం''

''చెవిటివాడు కాడండీ. పొగరు. ఈ రోజుల్లో యెవర్నీ యెందుకని అడగడం తప్పు. ఉన్నది సున్నాగానీ, పవురుషాలుకేం లోటు లేదు. చూశారా. ఇదంతా కూర్చోడానికి ఆ పిల్లకి చోటిస్తారనే యేషాలండీ. కడుపు నొప్పంటే సూడొచ్చామా? కనపడని జబ్బంటూ సెప్పి, సీటు కాజెయ్యాలని చూస్తున్నాడు. వాడు తెలివైన వోడా మనం తెలివైన వాళ్లమా'' వుపన్యాస ధోరణిలో ఆ పెద్ద లీడరు అరిచాడు.

''ఆ కడుపు నొప్పేదో యిప్పుడే తేలిపోతాది. బస్సు ఆగింది కదా. ఏమోయ్ సోడా పట్టు. కడుపు నొప్పి తగ్గుతాది'' రెండో లీడరన్నాడు.

వాడు మాటాడడు. పిల్లా మాటాడదు. పిచ్చిదానిలా చూస్తోంది. ముక్కులో చీమిడి కారుతోంది. ముఖంలో కళ్లు నీటిలో మునిగివున్నాయ్. వర్షం నించి తడిచిన రెండు జానల జుత్తు విరబోసి వుంది.

''చూశారా! సోడా పట్టమంటే పట్టలేదు. దానికేం కడుపునొప్పి లేదు. అంతా వేషం. లేవయ్యా - లే - కింద కూర్చుని ముగ్గురు నిల్చున్న జాగా మింగేశావు. లేస్తావా? లేదా?''

వాడు నిల్చుని

''నన్ను మట్టేశారు. నా పిల్లని మట్టేకండి బాబూ!''

''జబ్బా గిబ్బా లేదు - దాన్నీ నిలబెట్టు. మరో యిద్దరు నిల్చునే సోటుంటాది- సూసావా? ఒకరి మీద ఒకరు. ఆడా మగా అంతా యేకమై పోనారు.''

''ఎవరి ఆతృత ఆలది! మరేం సెయ్యడం?'' అని లీడరు సీటుకు ఆనుకుని నిల్చున్న ఒక వయసులో వున్న ఆవిడ నిస్పృహ!

బస్సుతో పాటు కారు మేఘాలు కదులుతూ వర్షం యింకా తెరిపి యివ్వలేదు. బస్సులో గోలా తగ్గలేదు. ఈ గోల జోలపాటలా వుందేమో చిన్న లీడరు మళ్లీ కునుకుపాట్లలో పడి పెద్ద లీడరు మీద ఒరిగిపోయాడు. గట్టిగా తట్టి లేపి ''ఏమీ యీ యేషం? ఎవడ్ని అనుకున్నావ్?''

ఆవులింతలు తీస్తూ మేల్కొని ''అటు ఆయమ్మని యేటీ అననోడివి - యిటు నేను పడితేనా తప్పు?''

''ఒంటి మీద ధ్యానం పెట్టుకుని మాటాడవయ్యా - తాగున్నావా యేటి?''

''నిజం పలికితే తాగినానంటావేటి?''

"ఆయమ్మ సిస్టర్ - చెల్లెలులాంటిది. ఆడాళ్లని గౌరవించడం నేర్చుకోవయ్యా?"

"నీ సిస్టరైతే నీవు యిలా కూర్చుంటావా? లే ... లే... ఆయమ్మకి సీటు యిచ్చే."

"మొగాడి పక్కన కూర్చుంటాదా? ముందు నీవు లేచి సీటు యిచ్చే."

"బాబ్బాబులు ... మీ యిద్దరు నేసిపోతే - ఆయమ్మా, నా కూతురూ యిద్దరూ కూకుంటారు" ప్రాధేయపడ్డాడు ఆ పదేళ్ల పిల్లతండ్రి.

ఇద్దరు లీడర్లూ ఒకరినొకరు చూసుకుని కళ్లెర్ర చేశారు. ఎవరూ లేవలేదు. పెద్ద లీడరు ప్రక్కన నిల్చున్న ఆడది మెల్లగా బస్సు వెనుకకు జారిపోయింది. పదేళ్ల పిల్ల పిచ్చిదానిలా చూస్తూనే వుంది. అప్పుడప్పుడూ కళ్లల్లో తడి ఆరకుండా యేడుస్తూనే వుంది.

వర్షం బీభత్సం కాస్త తగ్గింది. అరవకుండానే మాటలు వినిపిస్తున్నాయ్. మీద పడుతున్న నిద్దర మత్తు మనిషిని తోసేస్తూ లీడరు.

"నల్లమందు మింగావా? నిద్దర మాత్రలు వేసుకున్నావా?"

"కలలోనైనా సొరగం సూద్దామని"

"తెలివొస్తే యింకేంటుంది యీ పెపంచకంలో? తిట్టుకోడాలు, కొట్టుకోడాలు, పీకలు తెగేసుకోడాలు. ఇంతకన్నా నరకం యెక్కడుంటాది?" ఈ మాటలు విన్న వెనుకవాడు

"కుల గోత్రాలు వేరైనా, మలమూత్రాలొక్కటే కదా - ఎందుకిలా మనుషులు పోట్లాడు కుంటారో?" అన్నాడు.

"ఒరే సామీ! ఇంతకీ వర్షం తెప్పించిన పుణ్యాత్ముడ్ని యిప్పటికైనా పోల్చుకున్నావా?" అని మొదట వేసిన ప్రశ్న గుర్తుకు తెచ్చి అడిగారు.

"పుణ్యం యెలా గొస్తాది? ఆర్జించాలయ్యా - ముఖం సూసి అతగాడేం సెప్తాడు?" పెద్ద లీడరు ఖస్సుమన్నాడు.

"నేను మూడుసార్లు కాశీ వెళ్లాను."

"నేను పతి యేడూ తిరపతి మొక్కు సెల్లించుకుంటాను."

"నేను వూర్లో పిల్లల సదువుకని బడి కట్టిస్తామంటే - యెభరా మెట్ట రాసిచ్చేశాను" అన్నాడు లీడరు. ఎవరో అబద్ధం అన్నట్లు వినిపించింది.

ఎవరో కాదు తనలో తనే అనుకున్నాడు.

"మీరంతా దానాలు సేసి, కాశీపోయి పుణ్యాత్ములై పోతే, మాలాటి అనాదులేటౌతారు బాబో?" వెనుకనించి యింకొకడెవడో ప్రశ్న వేశాడు. అంతేకాదు పాపాత్ముల గురించి ప్రశ్న వేశాడు.

"గతిలేక కడుపుకోసం దొంగతనం సేసినోలు, రంకూ బొంకూ నేర్చినోలు - ఆలంతా పాపాత్ములేనా బాబో? సదువుకున్న మారాజులు సెప్పండి."

జవాబు రాకండానే వర్షం తగ్గిపోయింది. శ్రీకాకుళం ప్రయివేటు బస్సు స్టాండులో బస్సు ఆగింది. నిల్చున్నవాళ్లు దిగిన తరవాత పెద్ద లీడరు తన బరువైన శరీరాన్ని కప్పిన బట్టలను దులుపుకుంటూ దిగేసరికి యేం చూశాడు?

ఆ పదేళ్ల పిల్ల. ఆ పిల్ల పక్కన నిల్చున్న తండ్రి. ఆ తండ్రి పక్కన బస్సులో చూసిన పోలీసువాడు.

"నేననుకున్నాను. వీడు దొంగ వెధవ అని. ఇద్దరూ కలిసి యేదో దొంగతనం చేసుంటారు" అనుకుని జేబులో తన పర్సు వుందో లేదో అని

---

సుప్రసిద్ధ అమెరికన్ రచయిత "నథానియేల్ ఆథోరన్"ను చిన్నప్పుడు అతని తండ్రి "నీవు జీవనోపాధికై ఏం పని చేస్తావు" అని అడిగాడు.

"నేను ప్రజల పేదిలపై ఆధారపడి న్యాయవాదిగా బ్రతకను. వైద్యునిగా రోగగ్రస్తులపై ఆధారపడి జీవించడం నాకిష్టం లేదు. మత బోధకునిగా ప్రజల పాపాలపై జీవయాత్ర సాగించలేను. రచయితగా బ్రతుకుతాను" అని నథానియేల్ ఆథారన్ చెప్పాడట.

సేకరణ: డాక్టర్ కరిమద్దెల నరసింహారెడ్డి

---

ఒకసారి తడుముకున్నాడు.

"హమ్మయ్య - అపకారం జరగలేదు."

అంతలో పోలీసు

"టీ తాగివస్తాను - ఇక్కడ కూర్చోరా" అని వెళ్లాడు.

పెద్దలీడరు వాడి దగ్గిరకు వెళ్ళి అడిగాడు.

"పోలీసోడు యేంటొచ్చాడు. ఏటిరా సంగతి?"

"ఏటి సెప్పకుంటే యెవురు నమ్ముతారు?"

"నేను నమ్ముతాను ... సెప్పరా?"

"తమరి వూరూ పేరూ ముందు సెప్పండి."

"మా యింటి మీద పడ్తావా?"

"ఉన్న పాటున పోలీసుటేషను వించి వచ్చిసినాం. సేత పిల్లి గవ్వనేదు. ఒక పది రూపాయలు అప్పుయిప్పించండి. తమరింటికొచ్చి యిచ్చేస్తాను."

"నీకా అప్పు? నివ్వేటి తీరుస్తావులే. ముందు ఒక మాట సెప్పు - ఏటి తప్పు సేసినావు?"

"నానా తప్పు ... తప్పు సేసిన యెదవ, కాపీ హోటలు యెదవ - మా సుట్టాల కుర్రాడే..."

"ఏం సేశాడు? ఆడు సేస్తే నీ యెంట పోలీసులేల?"

"నా కూతురు బతుకు అల్లకల్లోలం సేసినాడు"

"ఇంత సిన్నపిల్ల బతుకెలాగు అల్లకల్లోలం సేస్తాడు రా?"

"నీకెందుకులే బాబూ?"

"ఇంతకీ యేం సేసినాడురా?"

"పొగరుబోత్తై పోనాడు. పొరపాటు ఆలోచనలో దిగినాడు."

"నానుస్తా వెందుకురా? అసలు జరిగిందేటి నిజం సెప్పరా?"

"ఇంకా అర్థం సేసుకోనేదా బాబో? ఆ కాపీ హోటల్లో నా కూతురు గిన్నెలు కడిగేది. నూనూగు మీసాల ఆ యెదవకి పోయే కాలం వచ్చింది. నా కూతురికి రేపు సేసినాడు రేపు."

"రేపా? ఇంత సిన్ని పిల్లకా? నేను నమ్మనురా?"

"ఈ పట్నంలో ఆడ డాక్టరమ్మ వున్నది కదా పరీక్షకి పోలీసు బాబు తెచ్చినాడు."

"ఎంత అమాయకుడివిరా! బస్సులో యీ మాట సెప్పి వుంటే ఎవురికైనా కనికారం పుట్టి సీటు యిచ్చేవారు కదా."

"ఆ సీటు సీటు కోసం, పదుగురి మద్దిన, నా పిల్ల పరువు కాల్చాలా?"

"ఇప్పుడు పోలేదా మరి?"

"బస్సులో వున్నోలు వాడవాడోలు కదా. ఈ వైనం అన్ని దిక్కులా పాకిరేయదా? రేపు పొద్దున్న యీ పిల్ల యెదిగితే సంబంధాలు వస్తాయా? బస్సులో యీమాట సెప్పినా, తమరు లేసి పోయి సీటు యిచ్చుందురా?"

అప్పుడే పోలీసువాడు తిరుగవచ్చాడు. "ఈ పిల్లకి యెవడో రేపు సేసాడంటున్నారు. ఇది నిజమేనండి జవానుగారూ."

"నిజమే."

నాలుగడుగులు వేసి తిరుగవచ్చి ఆ పెద్ద లీడరు "ఇదరా యీ రూపాయి కర్చు పెట్టుకో" అని వాడి బనియను జేబులో పెట్టి వెళ్లిపోతుంటే వాడు లీడరు వెంటపడి ఆపి అన్నాడు "నా కూతురికి ఆ పొగరుబోతు రేపు సేసినాడు. నివు నన్ను రేపు సేస్తావా? ఇది నీకు నాయమా?"

"కాపీ తాగమనిస్తే అదేటిరా ఆ రేపు మాట?"

"పది రూపాయలు అప్పు అడిగితే నన్ను నమ్మావు కాదు. నాను అడక్కునోడ్ని కాను. ఒక్క నాడు ఓటుకి నోటు పుచ్చుకోలేదు. మరియాదగా బతుకుతున్నా. అదిగో అడుక్కుంటున్నవోలు అక్కడున్నారు ఆలికేసి పున్నెం సంపాదించుకో" అంటూ ఆ పాత రూపాయి నోటు లీడరు జేబులో కుక్కేసాడు. "అప్పు యిమ్మని ఆ పోలీసు బాబుకే బతిమాలుతాను" అనుకుంటూ వెనుకకు నడిచాడు.